సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 4 । నవంబర్ । 2023



తేలికపాటి వర్షసూచన

రాగల నాలుగు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు సహదేవ రెడ్డి, అశోక్‌కుమార్ తెలిపారు.



టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/19.7°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మహిళల ఫుట్‌బాల్ విజేత అనంతపురం

- రెండో స్థానం సాధించిన శ్రీసత్యసాయి జిల్లా



అనంతపురం జిల్లా జట్టుకు విన్నర్స్ ట్రోఫీ అందజేస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏఎన్‌యూ: రాష్ట్ర స్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీల విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా జట్టుతో పాటు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల జట్లకు బహుమతులు అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ఏర్పాట్లు



ఎన్నికల ప్రక్రియపై సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వర్చువల్‌గా సమీక్షించారు. లా అండ్ ఆర్డర్, చెక్ పోస్టులు ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి, సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్, సి విజిల్, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామక ప్రణాళిక, స్ట్రాంగ్ రూం, రిసెప్షన్ కౌంటర్, సెక్యూరిటీ ప్లాన్, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక తయారు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

దొంగకు రెండున్నరేళ్ల జైలు



గోరంట్ల: ఓ చోరీ కేసులో ముద్దాయికి రెండున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (జేఎఫ్‌సీఎం) శుక్రవారం తీర్పు చెప్పారు. గోరంట్ల సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాల మేరకు...2021 జనవరి నెలలో గోరంట్ల మండలంలోని పాలసముద్రం, మల్లాపల్లి గ్రామల్లోని రెండిళ్లలో చోరీ జరిగింది. విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లగా బాధితుల గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి సీఐ జయానాయక్... దర్యాప్తులో భాగంగా ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి గ్రామానికి భీమినేని అమరనాథనాయుడు చోరీలకు తెగబడినట్లు నిర్ధారించుకుని 2021 ఫిబ్రవరి 8న వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న నిందితున్ని అరెస్టు చేసి చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించాడు. అనంతరం సీఐ జయానాయక్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు శుక్రవారం పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద విచారణకు రాగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి ముజీబ్ పసల్ సయ్యద్ నేరం రుజువు కావడంతో ముద్దాయి భీమినేని అమరనాథనాయుడుకు రెండున్నరేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీ శ్యామల వాదనలు వినిపించగా, కానిస్టేబుళ్లు భాస్కర్, కరుణకర్‌రెడ్డి కోర్టు ఎదుట సాక్షులను ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్ష పడేలా చేశారు.

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



బహిరంగ సభ జరిగే మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు



పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

- సీఎం పర్యటన విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' సొమ్ము విడుదలకు ఈ నెల 7న సీఎం జగన్ పుట్టపర్తికి విచ్చేస్తున్నారని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం వారు ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, పుట్టపర్తి, మడకశిర, కదిరి, రాప్తాడు, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే పుట్టపర్తి విమానాశ్రయం సమీపంలోని వైజంక్షన్ వద్ద ఉన్న గ్రౌండును పరిశీలించారు. అక్కడి నుండి వాహన పార్కింగ్‌కు అనుకూలంగా ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండును, సత్యసాయి విమానాశ్రయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు మాట్లాడుతూ... ఈనెల 7న ఉదయం 9.30 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి బహిరంగ సభకు చేరుకొని రైతులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రాష్ట్ర రైతాంగానికి ఇక్కడి నుండే వైఎస్సార్ రైతు భరోసా సొమ్మును విడుదల చేస్తారన్నారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

సమన్వయంతో పని చేయాలి

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ...సీఎం జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆర్‌అండ్‌బీ, రవాణా, విద్యుత్, ఆర్టీసీతో పాటు అన్ని సంక్షేమ శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా లబ్ధిదారులు, ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలన్నారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగు నీరు, విద్యుత్, పార్కింగ్, సీటింగ్ తదితరవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఏఓ సుబ్బారావు, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీపీఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి, సీపీఓ విజయ్ కుమార్, జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, కృష్ణసుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతోన్న క్రికెట్ మైదానం

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటనకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రైతులు, ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలివచ్చే అవకాశం ఉండగా, రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బహిరంగ సభ నిర్వహించే క్రికెట్ మైదానాన్ని ముస్తాబు చేస్తున్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులను సమన్వయం చేసుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పుట్టపర్తి నలుమూలలా వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలు కడుతూ పార్టీ శ్రేణులు బిజీబిజీగా ఉన్నారు.

భద్రతా కట్టుదిట్టంగా చేయాలి

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో పోలీసు అధికారుతో సమావేశమై ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 7వ తేదీన సీఎం సభకు వచ్చే వీఐపీలు, వీవీఐపీల వాహనాలను పార్కింగ్ చేసేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించాలన్నారు. పరేడ్ గ్రౌండ్, బైపాస్ రోడ్డు, వై జంక్షన్ ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రహదారి మళ్లింపు తదితర కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అంతిమంగా సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపం రాకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, శ్రీహర్ష, ఆర్‌ఐలు టైటాస్, నారాయణ, ప్రదీప్ కుమార్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

'టౌన్ ప్లానింగ్'లో ఏసీబీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ప్రసాద్

- పలు రికార్డుల స్వాధీనం

హిందూపురం: ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంపై దాడులు చేశారు. నేరుగా టౌన్ ప్లానింగ్ విభాగానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. అధికారుల పనితీరు గురించి విచారణ చేపట్టారు. పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ సీఐ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ... అవినీతి నిరోధానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 14400 నంబర్‌కు టౌన్ ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని, అలాగే మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ప్రస్తుతానికి భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్నామన్నారు. కొన్ని భవన నిర్మాణాలను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. అధికారులు అవినీతికి పాల్పడినట్లు తేలితే కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేస్తామన్నారు. దాడుల సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బంది రూ.46 వేల నగదు సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణ సమయంలో రూ.వెయ్యి కంటే ఎక్కువ మొత్తం ఉంచుకోరాదని, ఆ నగదు వివరాలు కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు నమోదు చేయకపోవడంతో వాటిని నాన్ అకౌంట్‌గా పరిగణించి సీజ్ చేశామన్నారు. మరో రెండు రోజుల పాటు విచారణ కొనసాగుతుందని, ఆ తర్వాత చర్యలు ఉంటాయన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతుకు 'మద్దతు'

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్
- గుడిబండ, రొళ్ల, అమరాపురం మండలాల్లో రాగుల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



మోరుబాగుల్‌లో రాగుల నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ చేతన్

గుడిబండ/రొళ్ల/అమరాపురం: రైతుల రెక్కల కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో రాగులు పండించిన రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.3,846 ప్రకారం కొనుగోలు చేస్తోంది. శుక్రవారం జాయింట్ కలెక్టర్ చేతన్ పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్‌తో కలిసి గుడిబండ, రొళ్ల, అమరాపురం మండలాల్లో పర్యటించారు. గుడిబండ మండలం మోరుబాగుల్, అమరాపురం మండలంలోని కె.శివరం, రొళ్ల మండలంలోని బీజీ హళ్లి రైతు భరోసా కేంద్రాల ఆవరణల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జేసీ చేతన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జేసీ మాట్లాడుతూ... రాగులు, జొన్నలు సాగుచేసిన రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన మద్దతు ధరతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. క్వింటా రాగులను రూ.3,846, హైబ్రిడ్ జొన్నలు క్వింటాల్ రూ.3,180, మల్లదండి రకం జొన్నలకు క్వింటాల్ రూ.3,225 ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులకు ఇబ్బందులు కలగకుండా సంచులు, కూలీల ఖర్చులు, రవాణా ఖర్చులు తదితర వాటిని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అయితే పంట ఈ– క్రాప్ చేయించుకున్న రైతుల నుంచే కొనుగోలు చేస్తామన్నారు. పంట కొనుగోలు చేసిన తర్వాత రెండు వారాల్లోనే నేరుగా రైతుల ఖాతాలోనే నగదు జమ చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మడకశిర నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాగి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఎండీ అశ్వర్థనారాయణ నాయక్, అమరాపురం జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, తహసీల్దార్లు రమేష్ బాబు, హసీనాసుల్తానా, నాగభూషణం, ఎంపీడీఓలు మునిస్వామి, ఆజాద్, రామారావు, డీపీఓ కృష్ణానాయక్, అమరాపురం వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, మడకశిర ఏడీఏ శ్రీకృష్ణమీనన్, ఏఓలు మంజునాథ, వీరనరేష్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల బాగు కోరిన ఏకైక నేత వైఎస్ జగన్

- సామాజిక సాధికార బస్సు యాత్రతో ఎన్నికల సమర శంఖారావం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



'జగనే ఎందుకు కావాలి' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఏర్పాట్లపై డీఎస్పీ చర్చిస్తున్న తలశిల రఘురాం, ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ' అంటూ బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకోవడంతో పాటు అధికారం కట్టబెట్టిన పాలనలో భాగస్వామ్యం చేసిన ఏకైక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. సీఎం జగన్ ఆయా వర్గాలకు చేసిన మేలుకు కృతజ్ఞతగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సాగుతోందన్నారు. శనివారం బస్సుయాత్ర ధర్మవరంలో జరగనుందని, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తన నివాసంలో నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో సమావేశమై బస్సుయాత్ర ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అన్నివర్గాలకు అధికారం అందాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. అందువల్లే 25 మంది ఉన్న మంత్రివర్గంలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చోటు కల్పించారన్నారు. అలాగే నలుగురికి ఉప ముఖ్యమంత్రులుగా తన పక్కనే కూర్చోబెట్టుకున్నారన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన మహిళను రాష్ట్ర హోం మంత్రిగా చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. తమది బడుగుల పార్టీ అని చెప్పుకునే టీడీపీ తన హయాంలో ఒక్క మైనార్టీ, ఒక్క ఎస్టీకైనా మంత్రి పదవి ఇచ్చిందా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ సర్కార్ రాష్ట్ర జనాభాలో 80 శాతం మంది ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన రాజ్యాంగబద్ధ పదవులు ఇచ్చిందన్నారు. నియోజకవర్గంలో సైతం మున్సిపల్ చైర్‌పర్సన్లుగా ఇద్దరు బీసీ మహిళలకు అవకాశం ఇచ్చామని, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్, కురుబ కార్పొరేషన్‌లతో పాటు అనేక పదవులను బీసీలకు కట్టబెట్టామన్నారు. చంద్రబాబు హయాంలో కేవలం తన సామాజికవర్గానికి మాత్రమే పదవులు ఇచ్చి బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు బైముతక రమణ, గజ్జల శివతో పాటు పట్టణంలోని 40 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'జగనే ఎందుకు' పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఏర్పాట్ల పరిశీలన..

సామాజిక సాధికార బస్సుయాత్రకు సంబంధించి సభావేదిక, రూట్‌మ్యాప్‌ను ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంతో చర్చించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బస్సు యాత్ర సాగనుందిలా...

సామాజిక సాధికార బస్సు యాత్ర కోసం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సభావేదికను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, తిప్పేస్వామి, శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, నాయకులు బుట్టా రేణుకలతోపాటు జిల్లా ప్రజాప్రతినిధులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. వీరంతా తొలుత కళాశాల సర్కిల్‌లో మహాత్మ జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం బస్సులో యాత్రగా సభా వేదిక వద్దకు చేరుకుంటారు.

2.62 లక్షల మందికి 'పింఛన్ కానుక'



ప్రశాంతి గ్రామంలో ఓ వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుశీల

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత కింద అందించే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. తొలిరోజు ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తం అందజేసిన వలంటీర్లు..రెండు, మూడు రోజుల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి, సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారి వద్దకే వెళ్లి పింఛన్ కానుక మొత్తం అందజేశారు. ఫలితంగా మూడోరోజు శుక్రవారం నాటికి జిల్లాలో 2.62 లక్షల మందికి పింఛన్ పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో 2,73,076 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.75,89,45,000 మంజూరు చేసింది. శుక్రవారం నాటికి వలంటీర్లు 2,63,374 మందికి రూ.73,17,82,750 మొత్తం అందజేయగా 97 శాతం పంపిణీ పూర్తయ్యింది. ఇంకా రెండురోజుల గడువు ఉందని, ఆలోపే మూడు శాతం మందికి కూడా పింఛన్ మొత్తం అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

బస్సెక్కారు.. బహుమతి పొందారు

- ఆర్టీసీ లక్కీడ్రాలో ముగ్గురికి కానుకలు



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: 'పల్లె వెలుగు' బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెంచేందుకు ఆర్టీసీ చేపట్టిన గిఫ్ట్ స్కీంలో ముగ్గురు బహుమతులు అందుకున్నారు. పుట్టపర్తి– ముదిగుబ్బ పల్లెవెలుగు సర్వీసులో ప్రయాణించిన కొత్తకోటకు చెందిన రమేష్, ముదిగుబ్బకు చెందిన లిఖిత, బుక్కపట్నానికి చెందిన రాజేంద్ర లక్కీ డ్రాలో బహుమతులు దక్కించుకున్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) మధుసూధన్ వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా పల్లెవెలుగుల్లో గిఫ్ట్ స్కీం అమలు చేస్తామన్నారు. ప్రయాణికులు టికెట్టు వెనుక భాగంలో పూర్తి పేరు, మొబైల్ నంబర్ రాసి బస్సులో డ్రైవర్ సీటు వెనుక భాగంలో అమర్చిన బాక్స్‌లో వేయాలన్నారు. నెల చివరి రోజున ప్రయాణికుల సమక్షంలోనే లక్కీ డ్రా తీసి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, ఆర్టీసీ కార్గో సర్వీస్ ఏజెంట్ ఖాదర్‌బాషాతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నికాయిట్ జట్ల ఎంపిక



టెన్నికాయిట్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే టెన్నికాయిట్ అండర్–14 , అండర్–17 బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియను శుక్రవారం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా కార్యదర్శి బి.సుగుణమ్మ తెలిపారు. ఎంపిక పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నాగచరిత, కృష్ణవేణి, సుప్రియ, దివ్య, దిలక్షిత, బాలాజీ, వేము చరణ్, గణేష్, యశ్వంత్, గురుస్వామి, అనుష్క, జ్యోతిక, స్పందన, పూజ, వర్ష, రాంచరణ్, లతీఫ్, మోహన్ రాజ్, చిన్ని కృష్ణ, మహిధర్ ఎంపికయ్యారు.

6, 7 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక..

అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే అండర్ –14, అండర్ – 17 బాల, బాలికల జట్ల ఎంపికను ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ తెలిపారు. అండర్ –14 బాల, బాలికల జట్లకు ఆరో తేదీన, అండర్ –17 బాల, బాలికల జట్లకు ఏడో తేదీన ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

అభ్యసన సామర్థ్య పరీక్ష ప్రశాంతం

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అభ్యసన సామర్థ్య పరీక్ష ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే 1,123 పాఠశాలల్లోని 28,391 మంది విద్యార్థులకు గానూ 26,199 మంది (92.28 శాతం) హాజరైనట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. జిల్లాలోని 1,136 సెంటర్లలో నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. ఇన్విజిలేటర్లుగా డిగ్రీ, పీజీ, డైట్, ఇంజినీరింగ్ విద్యార్థులు వ్యవహరించారన్నారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి 10వ తేదీ వరకు ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే సిద్దారెడ్డి వారోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. 4న ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్త ప్రహ్లాద చరిత్ర, 5న కూచిపూడి, భరతనాట్యం, 6న హరికథ, 7న సంగీత విభావరి భజన, 8న కోలాటం, 9న విష్ణు సహస్ర నామ పారాయణం, లలిత సహస్ర నామము, 10న ఆధ్యాత్మిక ప్రవచనాలు, నరసింహస్వామి చరిత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభుడు

స్వామీజీ కిడ్నాప్

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామానికి చెందిన స్వామీజీ రామణ్ణ కిడ్నాప్‌కు గురయ్యారు. పూజారి రామణ్ణ ద్విచక్ర వాహనంలో పావగడ నుంచి రాజవంతి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఆగంతకులు కిడ్నాప్ చేశారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే బళ్లారికి చెందిన కొందరు రామణ్ణతో కొద్దిరోజుల క్రితం గొడవ పడ్డారని, వారే రామణ్ణను కిడ్నాప్ చేసి ఉండవచ్చనే అనుమానంతో స్థానిక పోలీసులు బళ్లారికి వెళ్లినట్లు సీఐ గిరీశ్ తెలిపారు. అయితే కిడ్నాప్‌కు గురైన స్వామీజీ గుప్త నిధులు తీసేవాడని, ఈ నేపథ్యంలో బళ్లారికి చెందిన కొందరు నిధి దొంగలతో పెద్ద మొత్తంలో సొమ్ము తీసుకున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలోనే స్వామీజీ కిడ్నాప్‌కు గురయ్యారని సమాచారం.

ముగిసిన గోల్డెన్ జూబ్లీ వేడుకలు


పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: రామాయణ ఇతిహాసాన్ని ఆధారంగా చేసుకుని శ్రీరాముడిపై ఆంజనేయుడు చూపిన అచెంచలమైన భక్తి విశ్వాసాలను కళ్లకు కడుతూ బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్ణాటక రాష్ట్రం భద్రావతి సత్యసాయి సేవా సమితి గోల్డెన్ జూబ్లీ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా భద్రావతి సత్యసాయి సేవా సమితికి చెందిన బాలవికాస్ చిన్నారులు సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 'శ్రీ రామ సేవక్ ఆంజనేయ' పౌరాణిక నాటకం అందరినీ అలరించింది.

చిన్నారుల సంరక్షణే ధ్యేయం


హెచ్‌బీఎన్‌సీ కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా ఆశా వర్కర్లు పని చేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన హోం బేస్డ్ న్యూ బార్న్ చిల్డ్రన్ కిట్స్ (హెచ్‌బిఎన్‌సీ)ను జిల్లాలోని పలువురు ఆశావర్కర్లకు డీఎంహెచ్‌ఓ శుక్రవారం అందజేశారు. 1,510 మంది ఆశా వర్కర్లకు వాటిని అందజేసి చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు గృహ సందర్శనకు వెళ్లినప్పుడు చిన్నారుల శారీరక ఎదుగుదలను పరిశీలించి లోపాలను గుర్తించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రభాకర్‌శెట్టి (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన ప్రభాకర్‌శెట్టి (58) మృతి చెందాడు. ఇతను స్వంత పని నిమిత్తం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై కదిరికి వస్తున్నాడు. కాళసముద్రం వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని రూరల్ మండల పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మొక్కజొన్న మిషన్‌లో పడి మహిళా రైతు..

పుట్టపర్తి అర్బన్: తమ స్వంత పొలంలో పండిన మొక్క జొన్నలను ఆడిస్తూ ప్రమాదవశాత్తూ మొక్కజొన్న మిషన్‌లో పడి మహిళా రైతు మృతి చెందిన సంఘటన పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాలమేరకు.. దిగువచెర్లోపల్లి గ్రామానికి చెందిన వెంకటస్వామి భార్య ఈశ్వరమ్మ (55) శుక్రవారం మొక్కజొన్న కంకులను మిషన్‌తో ఆడిస్తున్నారు. మిషన్లోకి కంకులు పోస్తూ ఉండగా ఆమె చీర మిషన్‌లో ఇరుక్కొని కింద పడి పోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

బత్తలపల్లి: ధర్మవరం పట్టణంలో నేడు (శనివారం) జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని బత్తలపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి తదితరులు విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందన్నారు.

ANANTAPUR DISTRICT CO-OPERATIVE CENTRAL BANK Ltd.,
SAHAKARA BHAVAN, SUBASH ROAD, ANANTAPURAMU - 515001
Email: adccbankatp@gmail.com, Web: anantapurdccb.com

Expression of Interest
(For Comprehensive Group Medical Insurance Policy)

The Bank invites Expression of Interest for pre-qualification from reputed Govt / Private General Insurance Companies extend comprehensive Group Medical Insurance Policy for employees and their family members working in the Bank.

The details of employees' data may be down loaded from the bank Website : www.anantapurdccb.co.in or obtained from the Establishment Section, ADDC Bank, Subash Road, Anantapur. The Expression of Interest shall reach the undersigned by 07-11-2023 before 3.00 p.m. Sealed quotations will be opened on 07-11-2023 at 4.00 p.m.

The Bank reserves the right to cancel or extend the due date for submission of EOI without assigning any reason thereof.

Anantapur, Dt: 03-11-2023 Sd/- Chief Executive Officer















సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT అడ్మిషన్స్

■ చివరి అవకాశం-ఇంటర్ పాస్ స్టూడెంట్స్‌కి DMLT (బ్లడ్ టెస్ట్) కోర్స్ నందు Govt. సీట్స్ + Management సీట్స్ కలవు. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2750]

GNM నర్సింగ్ అడ్మిషన్స్

■ ఇంటర్ పాస్ స్టూడెంట్స్‌కి గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీ లో హాస్టల్ వసతి కలదు. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2749]

REAL ESTATE

PLOT FOR SALE

■ శ్రీ SVR గ్రీన్ ల్యాండ్స్. దీపావళి క్లోజింగ్ ఆఫర్ కేవలం ప్లాటు 1,50,000 మాత్రమే.(30X40) 2.75 సెంట్లు రాయల చెరువు హైవే అనుకొని గవర్నమెంటు మోడల్ స్కూలు దగ్గర. 94907 63299. [L-798882]

SERVICES

■ మోకాళ్ళ నొప్పులకు, కీళ్ల నొప్పులకు, మెడనొప్పి, విరిగిన ఎముకలకు మొ॥ చికిత్సలకు అహ్మద్ ఆర్థోపెడిక్ హాస్పిటల్, ATP. 9866689481. [A-315]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9502307742 [H-193279]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9281159721, 8919551629 [H-788343]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [HA-813]

■ అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427694 [H-788843]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221861]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు అపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221797]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52828, 6281208656 [B-1206467]

■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12,000+ట్రావెల్ అలవెన్సు+ఇన్సెంటివ్స్, అర్హత: డిగ్రీ, వయస్సు: 20–32, ఫోన్ నెంబర్: 7730899503 [G-1190]

■ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటీవ్ కావలెను. అనంతపురం & కదిరి వాస్తవ్యులు కావలెను. బైక్ ఉండవలెను. సంప్ర॥ 6303387829 [Y-784401]

■ MS కంపెనీ నందు టెలికాలర్స్ గా పనిచేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ఫీమేల్ వెంటనే కావలెను. అర్హత: 10th, జీతం: 16,000 నుండి 18,000 వరకు. ఫోన్ : 7416297427, 7032253968 [HA-783]

■ Paytm కంపెనీలో పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు (ఆన్‌రోల్) కావలెను. అర్హత : 10th, ఇంటర్, డిగ్రీ. జీతం + ఇన్సెంటివ్స్ = Rs. 30,000. # అనంతపురం : 9441945743, తాడిపత్రి: 9642735547, కళ్యాణదుర్గం+రాయదుర్గం : 9959090442, హిందూపురం + కదిరి: 9966133320, గుంతకల్ + గుత్తి : 9848555198, ధర్మవరం : 9676540905, పుట్టపర్తి : 9160730935. [A-776941]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.